సాక్షి
కామారెడ్డి


బుధవారం । 7 । జూన్ । 2023



ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సూచించారు.

- 9లో ▸



పల్లెకు పదివేల మొక్కలు

తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.1 /27.5

ఉదయం ఎండ ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతం అవుతుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి లక్ష్య అవార్డు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి లక్ష్య అవార్డుకు ఎంపికైనట్లు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్ మంగళవారం తెలిపారు. గత నెల 17న నేషనల్ లక్ష్య వైద్య బృందం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించిందన్నారు. ఇందులో భాగంగా సోమవారం కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన లక్ష్య అవార్డులో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి నిలిచిందన్నారు. లక్ష్య అవార్డులో లేబర్ రూం క్వాలిటీ విభాగంలో ఎంపిక కావడంతో మూడేళ్ల పాటు ప్రతియేటా రూ. రెండు లక్షలు, ఆపరేషన్ థియేటర్‌కు రూ. రెండు లక్షల అవార్డుకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

మరమ్మతులను త్వరగా పూర్తిచేయండి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): తరగతి గదులకు సంబంధించిన రిపేరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీపతి అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేటలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న తరగతి గదుల రిపేరింగ్ పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం మండలంలోని గండిమాసానిపేట, లక్ష్మాపూర్ గ్రామాల్లో జరుగుతున్న బడిబాట కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించి పిల్లలు పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, భవిత సిబ్బంది వెంకటేశం, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎస్సీ కంప్యూటర్స్ కోర్సు ప్రారంభం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్ కళాశాల అటానమస్ గుర్తింపు పొందడంతో ఈ విద్యాసంవత్సరం నుంచి బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ కోర్సును మంజూరు చేస్తూ కళాశాలల విద్యాకమిషనర్ ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు దోస్త్ వెబ్‌సైట్‌లో చేర్చారు. దోస్త్ వెబ్‌సైట్‌లో బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ కోర్సు ప్రవేశానికి విద్యార్థులు ఆప్షన్ ఇవ్వొచ్చని ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీటెక్ సీఎస్‌ఈతో సమానమైన నాలుగేళ్ల బీఎస్సీ ఆనర్స్ కోర్సు చేసిన వారికి ఉపాధి అవకాశాలు బాగా ఉంటాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీయువకులు కొత్తగా ఓటు హక్కు కోసం బీఎల్‌వోలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులకు ఓటర్ల జాబితాల సవరణపై సమీక్ష నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితాలను బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేస్తారని తెలిపారు. కుటుంబం మొత్తం ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా చూడాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సవరణ కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన



కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని ఎస్పీ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదామును మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును, రికార్డులను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ భుజంగరావు, అధికారులు పాల్గొన్నారు.

వామ్మో.. జూన్!

- మధ్యతరగతి వారికి బడులు, కాలేజీల భయం
- డొనేషన్లు, ఫీజులు, బ్యాగులు, పుస్తకాల భారం
- ప్రైవేటు బడుల్లో ఇష్టారాజ్యంగా ఫీజుల మోత
- ఫీజుల దోపిడీని పట్టించుకోని విద్యాశాఖ





కామారెడ్డి టౌన్: జూన్ వస్తుందంటే తల్లిదండ్రుల్లో దడ మొదలవుతుంది. నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి కొద్దిరోజులు మాత్రమే ఉండడంతో పిల్లల తల్లిదండ్రులు చదువుల కోసం ఇంటి బడ్జెట్‌ను తయారు చేస్తున్నారు. ఖర్చు భారంగా మారినా పిల్లల భవిష్యత్ కోసం వెచ్చించక తప్పదని భావించి ఖర్చులకు వెనుకాడడం లేదు. సామాన్య, మధ్య తరగతి వారు ప్రైవేటు ఉద్యోగులు ఇందుకోసం కొన్నినెలల నుంచే తమ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు ఇతర పనుల కోసం డబ్బులను వెచ్చించకుండా వాయిదా వేసుకుంటున్నారు. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, బుక్కులు, లంచ్‌బాక్సులు వంటి ఖర్చులకు అప్పుల కోసం పరిగెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 12న పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఇప్పటికే పుస్తకాలు అందుబాటులోకి రాగా జిల్లాలోని మండలాలకు సైతం తరలించారు.

సామాన్యులకు మోయలేని ఆర్థికభారం

స్కూల్ ఫీజుల మాట వింటేనే తల్లిదండ్రులు భయపడిపోతున్నారు. నర్సరీ, ఎల్‌కేజీకి ప్రైవేటులో చూస్తే రూ. 20వేల నుంచి రూ. 40వేలకు పైగానే వసూలు చేస్తున్నారు. ఇక హైదరాబాద్‌లో లక్షల్లోనే ఫీజులు. ఇక పుస్తకాలు, యూనిఫాంల ధరలు, రవాణా ఖర్చులు వేరుగా ఉంటాయి. ప్రైవేటు విద్యాసంస్థలు తమ పాఠశాలలో అన్ని కొనుగోలు చేసుకోవాలని నిబంధనలు విధిస్తున్నారు. కొన్ని కార్పొరేట్ విద్యార్థులు ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఇంటర్ చదువుల కోసం మధ్యతరగతి కుటుంబాలు సైతం తమ పిల్లల్ని రాజధానికి రూ. లక్షల్లో వెచ్చించి పంపుతున్నారు. ఫీజులు చెల్లించేందుకు అప్పుల కోసం వేట మొదలుపెట్టారు. మరోవైపు అడ్మిషన్లు, పుస్తకాలు అయిపోతాయంటూ ప్రైవేటు పాఠశాలలు చేస్తున్న ప్రచారం అంతా ఇంతా కాదు. జూన్ ఖర్చుల నుంచి ఎలా గట్టెక్కాలో తెలియని పరిస్థితి పేద కుటుంబాల్లో కనిపిస్తోంది. జిల్లాలోని పేద, మధ్యతరగతి కుటుంబాలు, వ్యవసాయ కుటుంబాలు తమ పిల్లలకు ఉన్నత విద్యను అందించాలని ఆరాట పడుతున్నాయి. ఇందుకోసం ప్రైవేటు విద్యపై మొగ్గు చూపుతుండడంతో మోయలేని భారంగా మారుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో వివిధ రకాల ఫీజుల పేరుతో వసూలు చేస్తూ మానసిక క్షోభకు గురిచేస్తున్నారు.

పెరిగిన పుస్తకాల ధరలు

ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రైవేటు దుకాణాల్లో పుస్తకాల అమ్మకాలు మొదలు పెట్టారు. ఈసారి పుస్తకాల ధరలు పెరిగాయి. పాఠ్యాంశాల పుస్తకాల ధరలు ఉండగా నోటు పుస్తకాల ధరలు కూడా భారీగా పెరిగాయి. ఒక్కో నోటుబుక్కుపై రూ. 6నుంచి రూ. 10వరకు పెరిగాయి. ఇలా ధరలు పెంపుతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

అదనంగా రూ. 50వేలకు పైగానే ఖర్చు

జూన్‌లో విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందటేనే ప్రతి ఇంట్లో ఎల్‌కేజీ నుంచి పదోతరగతి, ఇంటర్మీడియట్ వరకు టర్మ్‌ఫీజులు, బస్సు రవాణాతోపాటు ఇతర ఖర్చులు కలిపితే రూ. 15వేల నుంచి రూ. 50వేల వరకు ఖర్చవుతుంది. జిల్లాలోకి కార్పొరేట్ పాఠశాలలు రావడంతో పిల్లల చదువుల కోసం మధ్య తరగతి కుటుంబాలు కూడా మొగ్గు చూపుతున్నాయి. ఇంజినీరింగ్ చదవాలంటే కళాశాలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ మినహాయించిన కళాశాలల ఫీజులు లక్షల్లోనే ఉన్నాయి. మరోవైపు హాస్టల్ ఫీజులు అదనపు భారం ఉంటాయి. ప్రైవేటు పాఠశాలల్లో స్కూల్ ఫీజులు వేలల్లో ఉన్నాయి. దీనికి తోడు ఈవెంట్స్ పేరుతో అదనపు వసూలు కూడా ఉన్నాయి. పుస్తకాలతోపాటు బ్యాగ్‌లు టిఫిన్ బాక్సుల రేట్లు మండిపోతున్నాయి.

ఫీజులు పెంచుతున్నారు



నాకు కూతురు, కుమారుడు ఉన్నారు. ప్రైవేటు పాఠశాలలో ప్రతి యేటా ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచుతున్నారు. మేము చేసే కష్టం అంతా వారి ఫీజులకే సరిపోతుంది. ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకువచ్చి ఫీజులను నియంత్రించాలి.

– మల్లేశ్, కామారెడ్డి

చదువును కొనాల్సి వస్తోంది



నాకు కుమారుడు, కూతురు ఉన్నారు. నేను కిరణా వ్యాపారం చేసుకుంటూ పిల్లల్ని చదివిస్తున్నాను. వారి ఫీజులను చూస్తే భయమేస్తుంది. రూ. లక్షల్లో చెల్లించాల్సి వస్తుంది. చదువును కొనుక్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఫీజులను తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. పుస్తకాల ధరలు కూడా అమాంతంగా పెంచారు. సామాన్యులు పిల్లల చదువుల కోసం ఆగం అవుతున్నారు.

– భరత్‌కుమార్, కిరాణ వ్యాపారి, కామారెడ్డి

‘ప్రిలిమ్స్’ నిర్వహణకు సమాయత్తం!



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- జిల్లా కేంద్రంలో గ్రూప్–1 పరీక్షకు 11 కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 4,549 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం

సాక్షి, కామారెడ్డి: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలకు సంబంధించి కోర్టుల నుంచి అనుమతి రావడంతో టీఎస్‌పీఎస్సీ ఏర్పాట్లలో నిమగ్నమైంది. ప్రిలిమ్స్ నిర్వహణకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా జిల్లాలోని 11 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 4,549 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఇటీవలి కాలంలో వివిధ పరీక్షలకు సంబంధించి రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉన్నతాధికారులు జిల్లా అధికారులతో పలుమార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రూప్–1 ఉద్యోగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తుండడంతో జిల్లాలో వేలమంది రెండుమూడేళ్లుగా ప్రిపేర్ అవుతున్నారు. కీలకమైన ఉద్యోగాలన్నీ గ్రూప్–1 ద్వారానే భర్తీ చేస్తారు. ఈ నేపథ్యంలో గ్రూప్–1 కు ప్రిపేర్ అయిన వారు ఎన్నో ఆశలు పెంచుకున్నారు. ఏళ్ల తరబడిగా నియామకాలు లేక ఇబ్బందుల్లో ఉన్న నిరుద్యోగులు ఎన్నో ఆటుపోట్లను అధిగమించి తేదీ ఖరారు కావడంతో ఎలాగైనా బాగా రాసి ఉద్యోగం సంపాదించాలని ఆశతో ఉన్నారు.

ఆలస్యమైతే..

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో పరీక్షా కేంద్రాలన్నీ కామారెడ్డి పట్టణంలోనే ఏర్పాటు చేస్తున్నారు. 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఆయా కేంద్రాల్లో అభ్యర్థులను ఒక్కో గదిలో 24 మందికి సీట్లు కేటాయిస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించనున్నారు. సుదీర్ఘకాలం తర్వాత గ్రూప్–1 పరీక్ష నిర్వహిస్తుండడం, ఇటీవల టీఎస్‌పీఎస్సీ పరీక్షల నిర్వహణలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా పక్కాగా ఏర్పాట్లు ఉండేలా చూస్తున్నారు. కేంద్రాలకు ఉదయం 8.30 గంటల నుంచి 10.15 గంటల వరకు అనుమతిస్తారు. తరువాత మెయిన్ గేట్ క్లోజ్ చేసి, ఆలస్యంగా వచ్చిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించరు.

పొరపాట్లకు తావులేకుండా..

గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. మంగళవారం లైజన్ అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేయడం జరిగింది. పరీక్షాకేంద్రాలను ముందుగానే పరిశీలించాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోని అభ్యర్థులు వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలి. పకడ్బందీగా పరీక్షలను నిర్వహించడం జరుగుతుంది.

–జితేష్ వి పాటిల్, కలెక్టర్

గ్రూప్–1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఈనెల 11న జరుగనున్న గ్రూప్–1 పరీక్ష రాసే అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం పరీక్షల నిర్వహణపై లైజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో 24 మంది అభ్యర్థులు ఉండేలా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలను ముందుగానే పరిశీలించాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఈవో రాజు, అధికారులు పాల్గొన్నారు.

100 పడకల ఆస్పత్రిగా మార్చకపోతే రిలేదీక్ష

- బీఆర్‌ఎస్‌ను గోదావరిలో కలిపే సమయం వచ్చింది
- మాజీ మంత్రి షబ్బీర్‌అలీ



దోమకొండ ప్రభుత్వ ఆస్పత్రి బయట ఆందోళన చేస్తున్న మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, నాయకులు

దోమకొండ: దోమకొండ ప్రభుత్వ క్లస్టర్ ఆస్పత్రిని నెల రోజుల్లో 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, లేకపోతే ఆస్పత్రి ముందు రిలేదీక్ష చేపడతానని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన మంగళవారం సందర్శించి రోగులతో మాట్లాడారు. తాను ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడే 30 పడకల ఆస్పత్రిని తీసుకువచ్చానని, కానీ ఇక్కడ 13మంది వైద్యులకు ముగ్గురే ఉన్నారన్నారు. ఆస్పత్రిలో అంబులెన్స్ ఉన్నా డ్రైవర్ లేడని, గైనకాలజిస్ట్ లేరన్నారు. డ్రైవర్ లేక అంబులెన్స్ తుప్పుపడుతుందని దానికి పూలు చల్లి కొబ్బరికాయ కొట్టి నిరసన వ్యక్తం చేశారు. 10 రోజుల్లో డ్రైవర్‌ను నియమించకపోతే తన సొంత డబ్బులతో నియమిస్తానన్నారు. బస్టాండ్ పెచ్చులూడి శిథిలావస్థలోకి వచ్చిందని దానికి కనీస మరమ్మతులు లేవన్నారు. రైతులకు వడ్ల పైసలు ఇంతవరకు ఖాతాల్లోకి రాలేదని పేర్కొన్నారు. ఇన్ని సమస్యలు ఉండగా, బీఆర్‌ఎస్ నాయకులు దశాబ్ది ఉత్సవాలు ఎలా చేసుకుంటున్నారన్నారు. ఆస్పత్రి సమస్యలపై వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అభివృద్ధి విషయంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, విప్ గంప గోవర్ధన్‌లకు తనతో మాట్లాడే దమ్ముందా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు బంగాళాఖాతంలో కలిపే సమయం వచ్చిందన్నారు. ఆయన వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు మద్దిచంద్రకాంత్‌రెడ్డి, కార్యదర్శి స్వామి, ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ చిట్టెడి సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

పారిశ్రామిక రంగంతో యువతకు ఉపాధి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం, పక్కన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, అధికారులు

కామారెడ్డి క్రైం: అత్యధిక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేవి పారిశ్రామిక, వ్యవసాయ రంగాలేనని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పారిశ్రామిక ప్రగతి వేడుకలను కామారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం ద్వారా కూలీలకు, రైస్ మిల్లులకు, లారీ డ్రైవర్లకు, క్లీనర్లకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. పారిశ్రామిక రంగం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రైస్‌మిల్లుల యజమానులు పది రకాల వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని సూచించారు. నిరుద్యోగ యువత పప్పుల తయారీ, పసుపు, కారం పొడి, నూనె తయారీ లాంటి పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. టీఎస్‌ఐపాస్ ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ. 3,838.03 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 448 యూనిట్లకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. వీటి ద్వారా 8,043 మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. టీ ఐడియా పథకం కింద 2014 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 337 దరఖాస్తులు వచ్చాయన్నారు. రూ. 87.04 కోట్ల రాయితీలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 1,024 యూనిట్లకుగాను షెడ్యూల్ కులాల వారికి రూ. 45.95కోట్లు, తెగల వారికి 953 యూనిట్లకు రూ.42.16 కోట్లు, 80 యూనిట్లకు గాను దివ్యాంగులకు రూ.3.92 కోట్ల ప్రయోజనం చేకూరిందన్నారు. త్వరలో గిరిజనులకు పోడు భూముల పట్టాలను అందజేస్తామన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో సదాశివనగర్ మండలం లింగంపల్లి, జనగామ శివారులో 675 ఎకరాలు ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాచారెడ్డి మండలం లచ్చపేట శివారులో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు చేపల పెంపకం చేపట్టి ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా పరిశ్రమల అధికారి లాలూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ కలకలం!

- తెయూలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు
- ఆరు డిపార్ట్‌మెంట్లలో పరిశీలన
- ఈసీ ఆదేశాల మేరకు ప్రొఫెసర్ యాదగిరి ఫిర్యాదు
- సోదాల విషయం తెలియగానే వర్సిటీ నుంచి వెళ్లిపోయిన వీసీ



డిపార్ట్‌మెంట్‌లో వివరాలను సేకరిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఖలీల్‌వాడి: తెలంగాణ వర్సిటీలో నెలకొన్న అవినీతి, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందాలు తనిఖీలు నిర్వహించాయి. వర్సిటీ పాలకమండలి నిర్ణయాలను తుంగలో తొక్కి ఇష్టారీతిన వీసీ రిజిస్ట్రార్‌లను మార్చారు. ఉద్యోగ నియామకాల్లో భారీ వసూళ్లకు పాల్పడ్డారని, విచ్చలవిడిగా బిల్లుల చెల్లింపు, ఉద్యోగుల ఖాతాల్లోకి నిధులు ట్రాన్స్‌ఫర్ చేస్తూ జేబులు నింపుకున్నారని వీసీ ఆరోపణలు ఎదుర్కొన్నారు. పాలక మండలి రిజిస్ట్రార్‌గా యాదగిరిని నియమిస్తే అందుకు విరుద్ధంగా రిజిస్ట్రార్‌లను మారుస్తూ చివరికి కనకయ్యను కుర్చీలో కూర్చోబెట్టారు. వివాదం తారాస్థాయికి చేరి ఈసీ వర్సెస్ వీసీ అన్నట్లుగా మారింది. ఈ నేపథ్యంలో ఈసీ సభ్యుల ఆదేశాల మేరకు ప్రొఫెసర్ యాదగిరి ఫిర్యాదుతో జరిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. హైదరాబాద్‌లోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రామచంద్రాపురం యూనిట్(ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల పర్యవేక్షణ)కు చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో 10 మంది సభ్యుల బృందం తనిఖీలు ప్రారంభించారు. మధ్యాహ్నం 12. 30 గంటల నుంచి ప్రారంభమైన తనిఖీలు రాత్రి 7.30 గంటల వరకు కొనసాగాయి. సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు పరిపాలన భవనం వద్దకు చేరుకొని తనిఖీలపై చర్చించుకున్నారు. తనిఖీలు బుధవారం కూడా జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రతి విభాగాన్ని జల్లెడపట్టి..

తెయూకు చేరుకున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మొదట ఐదు బృందాలుగా విడిపోయి తనిఖీలు ప్రారంభించారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్, ఎస్టేట్ సెల్ అండ్ బిల్డింగ్ డివిజన్, అకౌంట్ సెక్షన్, కాన్ఫిడెంటల్ సెక్షన్, వీసీ చాంబర్, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్, ఇంజినీరింగ్ సెక్షన్, రిజిస్ట్రార్ ఆఫీస్, సర్వర్‌రూం, పర్చేస్ కమిటీ వివరాలను తనిఖీలు చేశారు. ఆ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఫైళ్లు, సీపీయూలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వర్సిటీలోని పరీక్షల విభాగంలోనే ఎక్కువగా అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. ఇందులో పీహెచ్‌డీ పట్టాలపై తనిఖీలు చేస్తున్నారనే చర్చ వర్సిటీలో జోరుగా సాగింది. రిజిస్ట్రార్ చాంబర్‌లో తనిఖీలు చేస్తున్న సమయంలో ప్రొఫెసర్ కనకయ్యను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పలు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. పాలక మండలి సమావేశాల్లో వర్సిటీకి సంబంధించిన బడ్జెట్‌కు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అడ్డగోలుగా ఖర్చులు చేసినట్లు గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాటిపై ప్రత్యేకంగా గురిపెట్టినట్లు తెలిసింది. గతేడాది అకడమిక్ ఇయర్‌కు సంబంధించిన అనుమతి కూడా ఇప్పటివరకు తీసుకోలేదని సమాచారం. వర్సిటీకి సంబంధించిన ఖర్చుల్లో అత్యధిక ధరలకు వస్తువులు కొనుగోలు చేసినట్లు గుర్తించారని తెలిసింది. వర్సిటీలోని బ్యాంక్‌లో యూనివర్సిటీతో పాటు వివిధ ఖాతాలకు సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు తెలిసింది.

టోల్‌ప్లాజా వద్ద వీసీ వాహనం నిలిపివేత

- పీఏ నుంచి ఫైళ్ల స్వాధీనం

భిక్కనూరు : ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులతో తెలంగాణ వర్సిటీ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వైస్‌చాన్స్‌లర్ రవీందర్ గుప్తాను అధికారులు డిచ్‌పల్లి ఎస్సై గణేశ్‌తో కలిసి భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద నిలిపివేశారు. వాహనంలో ఉన్న వీసీ వద్దకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెళ్లగా తన వాహనాన్ని ఎందుకు నిలిపివేశారని, తనను ప్రశ్నించే అధికారం మీకు ఉందా అంటూ వీసీ వారితో అన్నట్లు సమాచారం. దీంతో అధికారులు వీసీ పీఏ సవితను టోల్‌ప్లాజా కార్యాలయంలోకి తీసుకెళ్లి గంటకుపైగా విచారించారు. ఆమె నుంచి కొన్ని ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి వరకు వీసీ కారులోనే కూర్చున్నారు. విచారణ అనంతరం వీసీ తన సిబ్బందితో హైదరాబాద్ వెళ్లిపోయారు. అక్కడ ఉన్న వారు కొందరు సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీయగా పోలీసులు డిలీట్ చేయించారు.



సుమిత్ర ముందస్తు సేద్యం

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలు సుమిత్రానంద్ ముందస్తు సాగుకు సిద్ధం అయ్యారు. తన సొంత గ్రామమైన కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డిలో వానాకాలం పంట సాగుకోసం పనులు మొదలుపెట్టారు. నారుమడి కోసం విత్తనం చల్లారు. ముందస్తు సాగుతో అకాల వర్షాల ఇబ్బందులు అధిగమించవచ్చని సుమిత్ర పేర్కొన్నారు. –సాక్షి, కామారెడ్డి

క్లుప్తంగా

విజిలెన్స్ దాడులను స్వాగతిస్తున్నాం



సిరికొండ(తెయూ): తెలంగాణ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన విజిలెన్స్ దాడులను స్వాగతిస్తున్నామని తెయూ పీడీఎస్‌యూ అధ్యక్షుడు సంతోష్ మంగళవారం తెలిపారు. అవినీతి అక్రమాలకు బాధ్యుడైన వీసీని, ఆయనకు సహకరించిన అధికారులను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమాలు చేయకపోతే విజిలెన్స్ దాడులు జరుగుతున్న సమయంలో వీసీ ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు పారదర్శకంగా విచారణ జరిపి నిజానిజాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మీనారాయణ, శివసాయి, అశ్విత్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో పతకాల పంట



నిజామాబాద్‌నాగారం: బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియంలో ఈనెల 2, 3 తేదీలలో 2వ ఇండియన్ ఇంటర్నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన తై క్వాండో క్యూరియస్ అకాడమీ క్రీడాకారులు పాల్గొని పతకాల పంట పండించారు. తెలంగాణ తరుపున జిల్లాలోని క్యూరియస్ తైక్వాండో అకాడమీకి చెందిన 14 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్యోరుగి, పుంసే (సబ్ జూనియర్, కెడెట్, జూనియర్, సీనియర్) కేటగిరిలలో 5 గోల్డ్, 5 సిల్వర్, 4 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. పతకాలు సాధించడంపై అకాడమీ హెడ్ కోచ్ మాస్టర్ వినోద్ నాయక్, క్రీడాకారులను కలెక్టర్ రాజీవ్ గాంధిహనుమంతు ప్రత్యేకంగా అభినందించారు. తైక్వాండో ఒక ఆట పరంగానే కాకుండా, ఆత్మ రక్షణ కోసం ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు.

ఇంటిగ్రేటెడ్ పీజీ పరీక్ష ఫీజు గడువు పెంపు

సిరికొండ(తెయూ): తెలంగాణ యూనివర్సిటీలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులకు చెందిన 8వ, 10వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షల ఫీజు గడువు ను ఈనెల 8 వరకు పొడగించినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొ. అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుంతో ఈ నెల 10వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inని సంప్రదించాలని ఆమె కోరారు.

పరీక్ష ఫీజు చెల్లించండి

నిజామాబాద్‌అర్బన్: టెక్నికల్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులు తీరీ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గలవారు, గతంలో ఫెయిల్ అయినవారు తీరీ పరీక్ష కోసం ఈనెల 16లోపు రూ.150 చెల్లించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈనెల 24లోపు చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కోటగల్లి ప్రభుత్వ బాలికల పాఠశాలలోని శిక్షణ శిబిరంలో సంప్రదించాలన్నారు.

ఎస్సారెస్పీ సందర్శకులకు భద్రత ఏదీ?

- ప్రాజెక్ట్ లోపల నీటి అంచున ఫొటోషూట్‌లు
- పట్టించుకోని అధికారులు



నేలకొరిగిన హెచ్చరిక బోర్డు



ప్రాజెక్ట్ లోపల నీటి అంచున ఫొటోలు దిగుతున్న సందర్శకులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సందర్శనకు, ప్రాజెక్ట్ వద్ద ఫొటోషూట్‌కు వస్తున్న పర్యాటకులకు రక్షణ కరువైంది. పలువురు పర్యాటకులు ప్రాజెక్ట్ లోపలికి వెళ్లి నీటి అంచున ఫొటోషూట్‌లు, షూటింగ్‌లు చేసుకునే వరకు వెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతేడాది ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చిన ఇద్దరు యువకులు నీటిలో గల్లంతయ్యారు. ప్రస్తుతం అక్కడే నిత్యం ఫొటోషూట్‌లు జరుగుతున్నాయి. అలాగే నెల రోజుల క్రితం ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చిన ఇద్దరు గోదావరిలో మునిగి మృతి చెందారు. అయినా ప్రాజెక్టు అధికారులు భద్రత చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రాజెక్టు అధికారుల తీరుపై పలువురు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

నేలకొరిగిన హెచ్చరిక బోర్డు..

ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీటిమట్టం తగ్గింది. పలువురు సందర్శకులు ప్రాజెక్ట్‌లో తేలిన నేలపైకి వెళ్లి ప్రాజెక్ట్ నీటి అంచున సరదాగా గడుపుతున్నారు. కానీ సరదా కాస్తా విషాదంగా మారే ప్రమాదం ఉంది. నీటి అలలు వేగంగా వీస్తున్నా పట్టించకోకుండ అక్కడే ఉండిపోతున్నారు. గతేడాది ప్రమాదం సంభవించడంతో ప్రాజెక్ట్ లోపలికి ఎవరు వెళ్లవద్దని ప్రాజెక్ట్ ఆనకట్టపై ముప్కాల్ మండల పోలీసుల ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం ఆ బోర్డులు నేలకొరిగాయి. అలాగే ప్రాజెక్ట్ లోపలికి వెళ్లకుండ కందకాలు తవ్వారు. వాటిని మొరం అక్రమ వ్యాపారులు పూడ్చి మళ్లీ రహదారులను ఏర్పాటు చేశారు. దీంతో ప్రాజెక్ట్ లోపలికి వాహనాలపై కూడ వెళ్లడానికి సులభమైంది. ఇప్పటికైనా ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి ఎస్సారెస్పీకి వచ్చే సందర్శకులకు తగిన భద్రత కల్పించి, రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కనువిందు చేస్తున్న ఆరుద్ర



వ్యవసాయ పనులు మొదలు పెట్టేందుకు ఆరుద్ర కార్తె అనుకూలమైంది. నగర పరిధిలోని పాంగ్రా శివారులో మంగళవారం ఉదయం ఇలా ఆరుద్ర దర్శనం ఇవ్వడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అరుణ వర్ణంలో మఖ్‌మల్ బట్టలా నాజూకుగా ఉండి.. ముట్టుకుంటే ముడుచుకుపోయే ఆరుద్ర పురుగులు కనువిందు చేస్తున్నాయి. ఎర్రగా, బొద్దుగా చూడముచ్చటగా ఉండే ఆరుద్ర పురుగులు తొలకరి వర్షాలు కురవగానే దర్శనమిస్తాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



కాంట్రాక్టు అధ్యాపకుల పోస్టుకార్డు ఉద్యమం



సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డులు పంపిస్తున్న తెయూ కాంట్రాక్టు అధ్యాపకులు

సిరికొండ(తెయూ): తెలంగాణ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు అధ్యాపకులు తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈసందర్భంగా వారు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డులు పంపించారు. అనంతరం అధ్యాపకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

భిక్కనూరు: గతంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ కాంట్రాక్టు అధ్యాపకులు మంగళవారం సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డులు పంపించారు.



భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో..

రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో 1,300 కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు నారాయణ గుప్తా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు సునీత, రమాదేవి, వైశాలి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

8న ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం 8న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పరమేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళాలో విశ్వ అగ్రో టచ్, టాటా క్యాపిటల్ తదితర కంపెనీల్లో పాల్గొంటున్నాయన్నారు. మేళాలో పాల్గొనే అభ్యర్థుల వయో పరిమితి 18 నుంచి 30లోపు ఉండాలన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసి ఉండాలన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీయువకులు ఉదయం 10:30కి శివాజీనగర్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయానికి తరలిరావాలన్నారు. ఇతర వివరాలకు 6305743423, 9959456793 సంప్రదించాలన్నారు.

బాన్సువాడ నర్సుకు జాతీయ అవార్డు

బాన్సువాడ: బాన్సువాడ మాత శిశు సంరక్షణ కేంద్రంలో పని చేస్తున్న నర్సు ఆరోగ్యజ్యోతి జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్–2023 అవార్డుకు ఎంపికైంది. ది నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ది న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ కర్ణాటక సంయుక్తంగా మంగళవారం కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు రవీంద్ర కళాక్షేత్రంలో ఇంటర్నేషనల్ నర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ 'జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్స్ అవార్డు'ను ఆరోగ్య జ్యోతికి ప్రదానం చేశారు. నర్సింగ్ వృత్తితో పాటు, వివిధ రంగాల్లో విశేష సేవలు చేసిన వారికి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సస్ అవార్డును అందజేశారు. ఆరోగ్యజ్యోతికి అవార్డు రావడం హర్షణీయమని సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్ తెలిపారు. ఆరోగ్యజ్యోతి గత పాతికేళ్లుగా ఆస్పత్రిలో పని చేయడమే కాకుండా తమ కూతురు మృతి చెందిన తర్వాత ఆరోగ్యజ్యోతి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సేవలు కొనసాగిస్తున్నారన్నారు. జీవనశైలి వ్యాధుల నిర్ధారణకు శిబిరాలు ఏర్పాటు చేసి వేసవికాలంలో 135 యూనిట్ల రక్తంను సేకరించారని అన్నారు. కరోన వేళ నిత్యవసరాల సరుకుల పంపిణీ, పేద విద్యార్థులకు చేయూత వంటి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరు పని చేయాలని సుపరింటెండెంట్ అన్నారు.



బెంగుళూర్‌లో ఏపీ గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆరోగ్య జ్యోతి



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిజాంసాగర్ ప్రాజెక్టు రంగురంగుల విద్యుత్ వెలుగులతో జిగేల్‌మంటుంది. ఉమ్మడి జిల్లా వరప్రదాయని అయినా నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది విద్యుత్ లైట్లతో అలంకరించారు. దీంతో సాగర్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు వెలుగులు నింపాయి. – నిజాంసాగర్(జుక్కల్)



ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. రైతులకు శాపం!

- ట్రాన్స్‌ఫార్మర్లకు కనెక్షన్లు ఇవ్వని విద్యుత్‌శాఖ అధికారులు
- కరెంట్ లేక పంటలకు నీరు అందించేందుకు అన్నదాతల తిప్పలు

బాల్కొండ: దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేయడంతో కరెంట్ లేక, యాసంగిలో పంటలకు నీరు అందక రైతులు తిప్పలు పడ్డారు. ప్రస్తుతం వానాకాలంలో ముందస్తుగా పంటలు సాగు చేసుకుందామంటే ట్రాన్స్‌ఫార్మర్లకు కనెక్షన్ ఇవ్వకుండ ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులెవరూ స్పందించడం లేదు. మెండోరా మండలం వెల్కటూర్ శివారులో గత రెండు నెలల క్రితం ఒక్క రోజులోనే వరుస పెట్టి ఏడు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ఎత్తుకెళ్లారు. వాటి పునరుద్ధరణ కోసం రెండు నెలలుగా రైతులు ట్రాన్స్‌కో అధికారుల చుట్టు చెప్పులు అరిగేల తిరిగారు. ఎట్టకేలాకు వారం రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించారు. కానీ వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం మరిచారు. ఫలితంగా రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.



వెల్కటూర్‌లో కనెక్షన్ ఇవ్వని ట్రాన్స్‌ఫార్మర్

వెల్డింగ్ చేపడితేనే కనెక్షన్?..

ప్రస్తుతం వానాకాల సీజన్ ప్రారంభం కావడంతో ముందస్తుగా రైతులు మొక్కజొన్న, పసుపు పంటను సాగు చేస్తున్నారు. కాకతీయ కాలువలో నీరు సమృద్ధిగా ఉండటం వల్ల వెల్కటూర్‌లో అధికంగా ముందస్తుగనే పంటల సాగు చేస్తున్నారు. కానీ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో కరెంట్ లేక నీటి సౌకర్యం లేకుండ పోయింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికాకుండా వెల్డింగ్ చేపట్టాలని ట్రాన్స్‌కో అధికారులు రైతులకు సూచిస్తున్నారు. రైతుల సొంత ఖర్చులతో వెల్డింగ్ చేపడితే కనెక్షన్ ఇస్తామని అధికారులు మెలిక పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో కనెక్షన్ ఇస్తాం..

భవిష్యత్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికాకుండ ఉండేలా వెల్డింగ్ చేపట్టాలని రైతులకు సూచించాం. విద్యుత్ ప్రధాన లైన్‌లో సమస్య ఉండటం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం జరుగుతుంది. త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్లకు కనెక్షన్ ఇస్తాం.

–మహ్మద్ అంజాత్ పాషా, ఏఈ ట్రాన్స్‌కో, మెండోరా

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కామారెడ్డి క్రైం: కామారెడ్డి ఏఎంసీ ఆవరణలో ఈ నెల 8 నుంచి 10వ తేదీల్లో జరిగే ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్లను కలెక్టరేట్‌లో మంగళవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. చేపలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వారు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గోవర్దన్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, అదనపు కలెక్టర్లు చంద్ర మోహన్, వెంకటేశ్ ధోత్రే, జిల్లా మత్స్య శాఖ అధికారి వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్పీకర్, ప్రభుత్వవిప్, అధికారులు

క్రైం కార్నర్

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు మూడో టౌన్ ఎస్సై శ్రావణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన రావుల మహేందర్(37) సేల్స్ మెన్‌గా పని చేస్తూ, జీవించేవాడు. ఇటీవల మద్యానికి బానిస కావడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత..



సిరికొండ(డిచ్‌పల్లి): డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి గ్రామంలో ఓ వివాహిత కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. నడిపల్లి గ్రామానికి చెందిన దాసరి హేమలత(20) గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈక్రమంలో ఆదివారం రాత్రి నొప్పి భరించలేక ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె భర్త నర్సింలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఉదయం ఘన్‌పూర్ గ్రామ చెరువులో మహిళ మృతదేహాన్ని స్థానికులు చూసి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా హేమలత మృతదేహంగా తేల్చారు. కడుపునొప్పి భరించలేక చెరువులో పడి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి అదృశ్యం



సంజీవ్ (ఫైల్)

రెంజల్(బోధన్): మండలంలోని నీలా గ్రామానికి చెందిన సంజీవ్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న మంగళవారం తెలిపారు. ఈ నెల 3న సంజీవ్ ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అతడి తల్లి అంజన్‌బాయి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కాస్లాబాద్‌లో యువతి...

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాస్లాబాద్ గ్రామనికి చెందిన ఉప్పరి లక్ష్మి అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై కోనారెడ్డి మంగళవారం తెలిపారు. కాస్లాబాద్ గ్రామానికి చెందిన ఉప్పరి భూమయ్య ఈనెల 3న మధ్యాహ్నం ఇంట్లో తన కూతురు లక్ష్మిని ఉంచి, పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం అతడు ఇంటికి వచ్చేసరికి ఇంట్లో కూతురు కనిపించలేదు. చుట్టుపక్కల ఎంతవెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో లక్ష్మి తండ్రి భూమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నగరంలో ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్‌కు చెందిన తమ్మి రాహుల్ (33) అదృశ్యం అయినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ మంగళవానం తెలిపారు. ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లిన రాహుల్ ఇప్పటికీ తిరిగి రాలేదు. రాహుల్ కుటుంబసభ్యులు ఎంతవెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో రాహుల్ తండ్రి తమ్మి పరమేశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అల్ప్రాజోలం సరఫరా చేసే వ్యక్తి అరెస్ట్

బాన్సువాడ : అల్ప్రాజోలంను సరఫరా చేసేందుకు వచ్చిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు బాన్సువాడ ఎక్సైజ్ సీఐ యాదగిరిరెడ్డి మంగళవారం తెలిపారు. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట్ మండలం బాగిర్తిపల్లి గ్రామానికి చెందిన గరిగే బాలకృష్ణగౌడ్ అనే వ్యక్తి కారు(టీఎస్ 16 ఈజీ 6836)లో 1.150 కిలోల అల్ప్రాజోలంను ఎల్లారెడ్డి వైపు నుంచి నిజాంసాగర్ వైపు తీసుకెళ్తున్నాడు. నిజాంసాగర్ మండలం హసన్‌పల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా బాలకృష్ణగౌడ్ కారులో ఉన్న అల్ప్రాజోలంను పట్టుకున్నామన్నారు. దీని విలువ సుమారు రూ. 3లక్షల నుంచి రూ. 4లక్షల వరకు ఉంటుందన్నారు. కారును సీజ్ చేసి, సదరు వ్యక్తిని అరెస్ట్ చేశామని ఆయన తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై తేజస్విని, టీటీఎఫ్ సీఐ విజయ్‌కుమార్, సిబ్బంది నాగరాజు, సందీప్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



నిందితుడిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. రాజంపేట మండలంలోని ఆర్గొండకు చెందిన దంపతులు బోయిని నారాయణ, బాలమణి మోటారు సైకిల్‌పై లింగంపేట్ మండలంలోని లింగంపల్లి వెళ్లి, సోమవారం సాయంత్రం తిరిగి సొంతూరుకు బయలుదేరారు. తాడ్వాయి మండలంలోని చిన్నదేమికలాన్ శివారులో వీరి బైక్‌కు కుక్కలు అడ్డు రావడంతో నారాయణ సడన్‌బ్రేక్ వేశాడన్నారు. దీంతో బైక్ వెనకాల కూర్చున బాలమణి కింద పడిపోయంది. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్‌షాక్‌తో గేదెలు మృతి

వేల్పూర్: మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం మేరెవార్ నారాయణ అనే రైతుకు చెందిన రెండు పాడి గేదెలు, ఒక పోతు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నారాయణ తనకు ఉన్న సుమారు 20 గేదెలను, పోతును నిత్యం సొంతంగా మేపుకుంటాడు. ఈక్రమంలో వేల్పూర్ మైనర్‌కుంట వైపు గడ్డి ఉందని గ్రామస్తులు తెలుపడంతో అటువైపు గేదెలను మేపడానికి తీసుకెళ్లాడు. ఆదివారం సాయంత్రం భారీ గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ వైర్లు తెగిపోయి పొలాల్లో పడ్డాయి. అప్పట్నుంచి అటు వైపు ఎవరూ వెళ్లకపోవడంతో తెగిన కరెంటు వైర్లను ఎవరూ గమనించలేదు. దీంతో మేతకు వెళ్లిన గేదెలు, పోతు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాయి. ఘటనా స్థలాన్ని మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ యశ్వంత్ రావు పరిశీలించారు. సుమారు రూ. 2లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు.




వేల్పూర్‌లో విద్యుత్‌షాక్‌తో మరణించిన గేదెలు

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని లక్కంపల్లి గ్రామ సమీపంలో ఇటీవల ఓ కారును ఆటో ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. లక్కంపల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు నందిపేటకు అంగడి కోసం వెళ్లి, తిరిగి ఆటోలో వస్తుండగా లక్కంపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలోప్రయాణిస్తున్న లక్కంపల్లి గ్రామస్తులు గజికిరి లక్ష్మి, మేదరి సాయమ్మ, జిందం రమలత, రొడ్డలింగం, ఆటో డ్రైవర్ జెల్ల ముత్యంలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదకరంగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన వన్నెల్ కే గ్రామానికి చెందిన నక్కల సుమన్‌పై కేసు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాటుసారా స్వాధీనం



తహసీల్దార్ ఎదుట నిందితుడిని బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కమ్మర్‌పల్లి: మండలంలోని ఇనాయత్‌నగర్‌లో సోమవారం రాత్రి ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టగా, గ్రామానికి చెందిన లంబాడి శంకర్ అనే వ్యక్తి వద్ద నుంచి 1.25 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు. మోర్తాడ్ ఎక్సైజ్ సీఐ గుండప్ప ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు నిందితుడిని మంగళవారం కమ్మర్‌పల్లి తహసీల్దార్ సురేష్‌కుమార్ ముందు బైండోవర్ చేశారు.